క్లుప్తంగా

జేఎంజే కళాశాలలో నాక్ బృందం పర్యటన



తెనాలిఅర్బన్: తెనాలి జేఎంజే మహిళా కళాశాలలో గురు, శుక్రవారాల్లో నాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం పర్యటించింది. నాక్‌కు సంబంధించిన ప్రొఫెసర్ గాదంగి ఇందిర, డాక్టర్ అల్వార్, డాక్టర్ జి.బ్రిందా, డాక్టర్ సెబాస్టియన్ కళాశాలలోని విద్య ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు వంటి వాటిని పరిశీలించి వాటి వివరాలు నమోదు చేయించుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ షైనీ మాట్లాడుతూ కళాశాలకు సంబంధించిన అన్ని వివరాలను అందజేసినట్లు శనివారం వివరించారు.

సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ మెరుగుపడాలి

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల వసతి గృహాల్లోని విద్యార్థులకు ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని అందించాలని, ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్లు చెబుతున్నా వసతి గృహాల నిర్వహణలో ఏమాత్రం మార్పు కనిపించటం లేదని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలోని అన్ని వసతి గృహాల్లోని వార్డెన్లు, ఇతర సిబ్బంది అప్రమత్తతతో వసతి గృహాల సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఇందుకు ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు ముఖ్యంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి, వెల్ఫేర్ కమిషనర్ బాధ్యత తీసుకోవాలని కోరారు.

కొలకలూరు ఇన్‌చార్జి కార్యదర్శిగా జయదేవ్




తెనాలిరూరల్: రూరల్ మండలం కొలకలూరు గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శిగా పొన్నెకంటి జయదేవ్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేసిన ప్రసాద్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో కంచర్లపాలెం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న పొన్నెకంటి జయదేవ్‌ను ఎంపీడీఓ దీప్తి ఇన్‌చార్జి కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు తీసుకున్న జయదేవ్ గ్రామ సర్పంచి డాక్టర్ చొప్పర ప్రీతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు... తెనాలి మండలం అంగలకుదురు వద్ద ఈ నెల 12వ తేదీ రాత్రి రోడ్డు దాటుతున్న క్రమంలో ఆటో ఢీకొట్టడంతో గాయపడింది. క్షతగాత్రురాలిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440796170, 9492985472 నంబరులలో సంప్రదించాలని ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ కోరారు.

నేడు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని డాక్టర్ రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాలలో ఆది, సోమ వారాలు అండర్ -15 విభాగంలో రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పల్నాడు రగ్బీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇ.కృష్ణారెడ్డి, సెక్రటరీ దానియేలు శనివారం తెలిపారు. రాష్ట్ర స్థాయి అసోసియేషన్ ద్వారా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుండి 18 బాలుర, 14 బాలికల జట్లు పాల్గొంటాయని వెల్లడించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు టి.శ్రావణ్‌కుమార్, చదలవాడ అరవిందబాబు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆట స్థలాన్ని పరిశీలించారు. సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వెంకట సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపల్ దీన సుదర్శన్ పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

పట్నంబజారు: వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు అయింది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేట రొట్టెల బజారులో నివాసం ఉండే పులుగుమోటు శంకరరావు గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 12 సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల నివాసాల్లో అడిగినప్పటికీ ఫలితం లేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మురుగుతో ముప్పతిప్పలు..

- తూములూరు శివారు చింతలపాలెంలో డ్రైనేజీ వ్యవస్థ లేక ఇక్కట్లు
- ఏ వీధిలో చూసినా దుర్గంధమే
- వర్షా కాలంలో రోగాల బారిన పడుతున్న ప్రజలు





తూములూరు శివారు చింతలపాలెంలో వీధిలో రోడ్డు వెంట ప్రవహిస్తున్న మురుగునీరు

తూములూరు(కొల్లిపర): పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థతో ఎక్కడి మురుగు అక్కడే పేరుకుపోతోంది. డ్రెయిన్లు ఉన్న వాటిని శుభ్రం చేసే నాథుడే లేకుండా పోయారు. అధికారులు పల్లెల వైపు కన్నెత్తిచూడడం లేదు. కూటమి నేతలు ప్రకటనలు గుప్పిస్తున్నా గ్రామాల్లో పరిస్థితి ఏమాత్రం మార్పు కనిపించడం లేదు.

వివరాలు.. మండల పరిధిలోని తూములూరు పంచాయతీ పరిధిలో చింతలపాలెంలో ఎస్సీ కాలనీలలో ఎటూ చూసినా మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. వర్షా కాలంలో ప్రతి ఇంటి ముందు మురుగు నీరు నిల్వ ఉన్న దృష్యాలు కనపడుతాయి. కాలనీలో మొత్తం ఐదు సిమెంట్ రోడ్లు ఉన్నాయి. వాటి నిర్మించి సుమారుగా పది సంవత్సరాల గడుస్తోంది. రోడ్లు నిర్మించినా డ్రెయిన్లు లేవు. దీంతో మురుగు పారుదల లేక దుర్గంధం వెదజల్లుతోంది. ఇళ్ల ముందు మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసనతో అంటూ రోగాలు వస్తున్నాయని మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు వర్షా కాలంలో సర్వసాధరణ మయ్యాయని స్థానికులు వాపోతున్నారు. మురుగునీటి విషయంలో తరుచూ స్థానికులు గొడవ పడుతున్నారు. డ్రెయిన్లు ఏర్పాటు చేయాలని ఎన్ని సార్లు అర్జీలు ఇచ్చిన ఫలితం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉపాధి హామీ పథకం నిధులతోనైనా అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రి పూట దోమల బెడద విపరీతంగా ఉంటుందని, ఇప్పటికైన ఉన్నత అధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ , లేదా మురుగు నీరు పోవుటకు మట్టి కాల్వలు(కచ్చా కాలువలు) తీసి మురుగు నీరు ఎటువంటి ఆటంకాలు లేకుండా పారే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రైనేజీలను ఏర్పాటు చేయాలి



కాలనీల్లో డ్రెయిన్లు ఏర్పాటు చేసి, రోడ్డు మధ్యలో మురుగు నీరు పారకుండా చూస్తే చాలు. మురుగు నీరు రోడ్డుపై పారు తుండడంతో నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది. ఈ విషయంపై పంచాయతీ అధికారులకు అనేక సార్లు విన్నవించిన ఫలితం లేకుండా పోయింది.

–అంద్ర రవితేజ

మురుగు నీరు వలన ఇబ్బందులు



గత 15 ఏళ్లుగా మురుగు కాల్వలు లేవు. ఇళ్ల ముందే మురుగుచేరి ఇబ్బందులు పడుతున్నాం. గతంలో ఎన్ని సార్లు పంచాయతీ వారికి సమస్య తెలుపుతున్నా పట్టించుకోవటం లేదు. వర్షా కాలంలో ఈ సమస్య తీవ్రత ఎక్కువగా ఉంది. గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణం చేయటం లేదా కనీసం కచ్చా కాలువలు గ్రామంలోని ఐదు సీసీ రోడ్లులలో మట్టి తీయించి ఎప్పటి కప్పుడు మురుగు నీరు పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

–శ్రీరాములు రత్నప్రకాశ్, చింతలపాలెం

కచ్చా కాలువలు ఏర్పాటు చేస్తాం

చింతలపాలెంలో డ్రెయిన్లు లేక మురుగు నీరు వలన పలువురు ఇబ్బంది పడుతున్నారు. ఆ విషయం రెండు రోజుల కిందట మా దృష్టికి వచ్చింది. దీనిపై గ్రామ కార్యదర్శికి గ్రామ సభలో తీర్మానం పెట్టి గ్రామ సర్వేయర్ ద్వారా పంచాయతీ భూమి ఎక్కడ వరకు ఉంది పరిశీలించి, వెంటనే మురుగు నీరు నిల్వ లేకుండా కచ్చా కాలువలు ఏర్పాటు చేస్తాం.

–వి.విజయలక్ష్మి, ఎంపీడీఓ, కొల్లిపర మండలం

రేపటి నుంచి ధనుర్మాస వ్రత దీక్షా మహోత్సవాలు



గోదపత్రికను ఆవిష్కరించిన రామానుజ దాసస్వామి

తెనాలి: ధనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణదీక్షా మహోత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు శ్రీశరణాగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నరేంద్ర రామానుజ దాసస్వామి తెలిపారు. శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి మంగళాశాసనాలతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. సోమవారం నుంచి జనవరి 13వ తేదీ వరకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్- వీఎస్సార్ కాలేజీ రోడ్డులో యర్రంశెట్టి గంగాధర్, యర్రంశెట్టి రమేష్‌బాబు స్థలప్రాంగణలో ధనుర్మాసవ్రతం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విష్ణుమొలకల విజయలక్ష్మి- వాలేశ్వరరావు దంపతులు, తన్నీరు సీతారామాంజనేయులు, జానకీదేవి, కోటేశ్వరరావు, లేళ్ల ఉమాదేవి, పూషడపు శివయ్య మాస్టారు, తన్నీరు చిన్నమ్మాయి, షణ్ముఖ జ్యూయలర్స్ పెనుగొండ వెంకటేశ్వరరావు, గుదిమెళ్ల సీతారామాచర్యులు, అధ్యాపకుడు కోటిరెడ్డి, విష్ణుమొలకల శ్యాంసుందరరావు, సోమరౌతు నాగేంద్రయ్య, పూషడపు వెంకట్రావు, ఉన్నం పున్నారావు పాల్గొన్నారు.

వ్యాపారిపై రౌడీషీటర్ దాడి



చికిత్స పొందుతున్న రమేష్‌జైన్

తెనాలిరూరల్: మద్యం మత్తులో వస్త్ర దుకాణానికి వెళ్లిన రౌడీషీటర్ వ్యాపారిపై ఇనుప గొట్టాంతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణ త్రీ టౌన్ పరిధిలో నివసించే తలవరస విజయ్‌కుమార్ అలియాస్ అప్పు శనివారం గాంధీచౌక్ సమీపంలోని ఓ షోరూమ్‌కు వస్త్రాలు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. పూటుగా మద్యం తాగి ఉన్న అతడి వలన ఇతర కస్టమర్లు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అప్పును బయట వేచి ఉండమని దుకాణ సిబ్బంది సూచించడంతో వారితో వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగకుండ మెయిన్ రోడ్డులో వాహన రాకపోకలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసే ఇనుప గొట్టాన్ని తీసుకొచ్చి క్రాంతి షోరూమ్ ఎదుట ఉన్న జైన్ సంఘ పెద్ద రమేష్‌జైన్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను దుకాణ సిబ్బంది తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవం



ఎన్నికను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ



నేలపాడు సంఘానికి ఎన్నికైన కార్యవర్గం

తెనాలి: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. తెనాలి మండల పరిధిలోని ఆరు సంఘాలు ఉండగా, అన్నీ ఏకగ్రీవమయ్యాయి. నేలపాడు, నేలపాడు-1, తెనాలి నీటి సంఘాలకు ఎన్నిక స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో నిర్వహించారు. పెదరావూరు, కఠెవరం, కొలకలూరు సంఘాలకు ఆయా గ్రామాల్లోని జెడ్పీ హైస్కూలులో ఎన్నికలు జరిగాయి. ఉదయం ప్రాదేశిక సభ్యుల ఎన్నికలు జరగ్గా మధ్యాహ్నం సాగునీటి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. నేలపాడు సంఘానికి అధ్యక్షుడు అయినంపూడి వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షుడుగా మద్దెల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. నేలపాడు-1 సంఘానికి అధ్యక్షుడిగా పెమ్మసాని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా చందు శంకరరావును ఎన్నుకున్నారు. తెనాలి సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా ఈదర శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ ఆదమ్ షఫీ, పెదరావూరు సంఘానికి అధ్యక్షుడిగా పాలడుగు ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా కొడాలి సురేష్ ఎన్నికయ్యారు, కఠెవరం సంఘానికి అధ్యక్షుడిగా నాగం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా అమ్మే రమేష్‌బాబు, కొలకలూరు సాగునీటి సంఘానికి గద్దె రత్తయ్య, ఉపాధ్యక్షుడిగా బొద్దులూరి సుబ్బారావు ఎన్నికయ్యారు. సాగునీటి సంఘాల ఎన్నికలను మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పరిశీలించారు. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక ఉంటుందని తెలియజేశారు. జలవనరులశాఖ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్న తెనాలి ఈఈ పులిపాటి వెంకటరత్నం పర్యవేక్షించారు.

కొల్లిపర మండలంలో..

కొల్లిపర: మండలంలోని ఐదు నీటి సంఘాలకు అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తహసీల్దార్ సిద్ధార్థ శనివారం తెలిపారు. వల్లభాపురం నీటి సంఘం అధ్యక్షుడిగా బొట్టా శ్రీరామురెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆరిగ పూర్ణచంద్రారెడ్డి, మున్నంగి నీటి సంఘానికి అధ్యక్షుడిగా బోనం వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జొన్నల నాగిరెడ్డి, కొల్లిపర నీటి సంఘానికి అధ్యక్షుడిగా కోటా వీరాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా కట్టా శ్రీహరి రెడ్డి, చివలూరు నీటి సంఘం అధ్యక్షుడిగా తోట ఏడుకొండలు, ఉపాధ్యక్షుడిగా ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, అత్తోట నీటి సంఘానికి అధ్యక్షుడుగా సోమరాజు రవిప్రసాద్, ఉపాధ్యక్షుడుగా మున్నంగి విజయభాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఎంపీడీఓ వి.విజయలక్ష్మి, ఏడీఏ ఉషారాణి, ఇరిగేషన్ ఏఈ శివాజీ, పీఆర్ ఏఈ అవుతు సాంబిరెడ్డి వ్యవహరించారు.

18న 'శిశిరం' ఆడియో పోస్టర్ విడుదల

తెనాలి: శ్రీకృష్ణ ఆర్ట్ బ్యానర్‌పై చిత్రీకరించిన 'శిశిరం' సినిమా ఆడియో పోస్టర్ ను ఈనెల 18న ఆవిష్కరించనున్నట్లు చిత్ర దర్శకుడు కనపర్తి రత్నాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆడియో పంపిణీ సంస్థ ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల కానున్నాయని చెప్పారు. విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఏపీ స్టేట్ టీవీ, స్టేజ్ అండ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌నాయక్ ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. తెనాలికి చెందిన సంగీత దర్శకుడు శాండీ అద్దంకి సంగీతం సమకూర్చగా, సాహిత్యం సురేంద్ర రొడ్డ, గానం టి.భవ్య, డీపీఓ మురళి, ప్రొడక్షన్ ఇన్‌చార్జి ఎం.శ్రీకాంత్, సహ దర్శకునిగా రమణ, స్టిల్ ఫొటోగ్రఫీ డి.మధు, ఎస్.ఎస్. వి శేఖర్ వ్యవహరిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొల్లిపర: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ ప్రదీప్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. కొల్లిపర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో అత్తోట, చివలూరు, శిరిపురం, కొల్లిపర, తూములూరు, గుదిబండివారిపాలెం, కొత్తపాలెం, దావులూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధులకు అల్పాహారం పంపిణీ

తెనాలిఅర్బన్: నాజర్‌పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శనివారం అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి సభ్యులు బైసాని సూర్యనారాయణ పుట్టిన రోజును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు, సుబ్బారావు, సత్యనారాయణ, లక్ష్మి, స్రవంతి పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వ తీరు బాధకారం

తెనాలిఅర్బన్: సినీ హీరో అల్లు అర్జున్‌తో తెలంగాణ ప్రభుత్వం వ్యవహరించిన తీరు బాధకరమని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని అల్లు అర్జున్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు పెసర్లంక రమణ కోరారు. తెనాలిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్‌లో తోపులాట జరగడం దురదృష్టకరమన్నారు. పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం వారి రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమని తెలిపారు. సమావేశంలో చిరంజీవి ఫ్యాన్స్ జిల్లా మాజీ అధ్యక్షుడు కుర్రా శ్రీను, నాయకులు టి.అశోక్‌యాదవ్, కె.బాలాజీ, కె.జశ్వంత్, ఎండీ రషీద్, సయ్యద్ మస్తాన్, షేక్ కరిముల్లా, పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లిలో శనివారం కోడి పందేల స్థావరంపై ఎస్ఐ కోటయ్య ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. ఆరుగురుని అదుపులోకి తీసుకుని, కోడి పుంజును, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కోటయ్య వివరాల మేరకు..ఉండవల్లి అమరావతి రోడ్డులోని శివాలయం పక్కన ఖాళీ స్థలంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు తనిఖీ చేశారు. నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మికులకు న్యాయం చేయాలి



తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కొరపాటి కోటేశ్వరరావు, స్టీరింగ్ కమిటీ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షకు వారు మద్దతు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని, పరిష్కారం అయితే కార్మిక కుటుంబాలు ప్రభుత్వానికి రుణపడి ఉంటాయని, మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో చొరవ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.అంకయ్య, ఎం. ఆశీర్వాదం, కె.ఆదినారాయణ, వై.నాగేశ్వరరావు, ఎం.రహీముల్లా, రమాదేవి, దుర్గా భవాని, నాగమల్లేశ్వరి, బుజ్జి పాల్గొన్నారు.

విద్యార్థులకు వివేకానందుని జీవితం ఆదర్శం

- రోటరీ 3150–డిస్ట్రిక్ట్ గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి
- మున్సిపల్ హైస్కూలులో వివేకానందుడి విగ్రహం ఆవిష్కరణ
- రూ.17 లక్షలతో నిర్మించిన సైకిల్‌స్టాండ్ ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరణలో రోటరీ క్లబ్ అతిథులు

తెనాలి: ప్రతి విద్యార్థి జీవితంలో నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని సాధించేందుకు పట్టుదలతో నిరంతరంగా కృషి చేయాలని రోటరీ 3150–డిస్ట్రిక్ట్ గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి సూచించారు. స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ సంయుక్తంగా బీజీఆర్ మైనింగ్ లిమిటెడ్ కంపెనీ సీఎస్సార్ నిధులతో నిర్మించిన సైకిల్ స్టాండ్, డైనింగ్ హాల్‌ను శనివారం ప్రారంభించారు. సభకు తెనాలి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. జీబీఆర్ కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్, రావి సాంబయ్య మున్సిపల్ పాఠశాల పూర్వ విద్యార్థి చుండూరు విజయఆనంద్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వివేకానందుని విగ్రహాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. శరత్ చౌదరి మాట్లాడుతూ వివేకానందుని జీవితం యువతకు మార్గదర్శకంగా నిలుస్తోందని చెప్పారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఒక మొక్కను నాటి పెంచాలని సూచించారు. తమ తల్లిదండ్రులు, పరిసరాల్లోని వారు వనమహోత్సవాల్లో విస్తృతంగా పాల్గొనేలా చొరవ తీసుకోవాలని కోరారు. విజయానంద్ మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలకు తిరిగి సేవ చేసే అవకాశం లభించటం ఎంతో అదృష్టమన్నారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వివేకానందుని నిలువెత్తు విగ్రహం పాఠశాలలో ప్రతిష్ఠించినందుకు ఆనందంగా ఉందన్నారు. రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ అధ్యక్షుడు విసిరెడ్డి బాలకోటిరెడ్డి మాట్లాడుతూ నగరాల్లోనే కాకుండా గ్రామాల్లోని పాఠశాలల అభివృద్ధికి తోడ్పడుతున్నామని తెలిపారు. ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అన్నే రతన్ ప్రభాకర్ మాట్లాడుతూ రాబోయే రోజులలో తెనాలి, హైదరాబాద్ రోటరీ క్లబ్బులతో మరిన్ని సేవా కార్యక్రమాలకు సహకరిస్తామని చెప్పారు. రోటరీ క్లబ్ తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు మాట్లాడుతూ, తెనాలిలో రూ.17 లక్షలతో మునిసిపల్ బాలుర పాఠశాలలో సైకిల్‌స్టాండ్, డైనింగ్ హాల్ నిర్మించడానికి సహకరించిన జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్, జీబీఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ హైదరాబాద్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. రోటరీ క్లబ్ తెనాలి కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని మౌలాబి ప్రసంగించారు. తొలుత రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి ఆధ్వర్యంలో ఏర్పాటైన రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. నిర్మాణ కమిటీ ఈదర వెంకట పూర్ణ చంద్, మల్లాది అర్జున్, జీవీ నారాయణ, కొల్లి రాజేంద్రప్రసాద్, కాకుమాను ఉపేంద్ర, గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళి, చేతస్ రాజ్ కొటారి పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో ఇరుపక్షాలకు మేలు



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి అబ్దుల్ షరీఫ్

తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి వై.నాగరాజు తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనలు మేరకు శనివారం స్థానిక న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తులు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం నమోదు అవుతున్న కేసుల్లో చాలా వరకు కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని కానీ కక్షిదారులు అనవసరమైన భేషజాలకు వెళ్లి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారని అన్నారు. న్యాయస్థానంలో కేసులు జరిగితే ఎవరో ఒక్కరే విజయం సాధిస్తారని, అదే మధ్యవర్తిత్వం ద్వారా లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరుపక్షాలు విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో రాత్రి 8.30 వరకు 39 సివిల్, 274 క్రిమినల్, రెండు ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.1,84,85,000 పరిహారం కింద అందించారు. లోక్ అదాలత్ మెంబర్లుగా రాజ్యలక్ష్మి, ప్రభావతి, దయాకిరణ్ వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

కుక్కల బెడద కట్టడికి చర్యలు తీసుకోవాలి



సభ్యులకు సమాధానం ఇస్తున్న ఏఓ శ్రీనివాసరావు, చిత్రంలో ఎంపీపీ చెన్నకేశవులు తదితరులు

మండల సమావేశంలో సభ్యుల డిమాండ్

తెనాలిరూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కొత్తపేటలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తెనాలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షత వహించారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు, వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులు సమావేశంలో చర్చించారు. విద్యుత్ బిల్లులు బకాయిల చెల్లింపులపై సభ్యులు అధికారులను నిలదీశారు. పల్లె పండుగా కార్యక్రమం, ఉపాధి హామీ పనులు, ఇళ్ల నిర్మాణాలు, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్య బోధన తదితర అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రతి 45 రోజులకు ఒకసారి సమావేశం నిర్వహించాలని, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సభ్యులు తెలిపారు. సమావేశం లో మండల ఉపాధ్యక్షురాలు కోడూరు స్వప్న, గోపి శెట్టి రమాదేవి, ఈఓపీఆర్డీ ప్రసాద్, ఏఓ ఆచంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మాలల మహా గర్జన' వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

మంగళగిరి: గుంటూరులో ఆదివారం జరిగే మాలల మహా గర్జన సభను విజయవంతం చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్, వైస్ చైర్మన్ గుర్రం రామారావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా జరిగే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కుల గణన అనంతరం ఉపాధి ఉద్యోగ అవకాశాలు పరిశీలించి, వర్గీకరణ చేయాల్సి వస్తే అప్పుడు తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అశోక్ కుమార్, మేరుగ నాగేశ్వరరావు, టి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బైక్ చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పట్నంబజారు: బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో గుంటగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్య వివరాలు వెల్లడించారు. ఇటీవల గుంటూరు నగరంలో బైక్ చోరీలు అవుతున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పక్కా సమాచారంతో ఉమెన్స్ కాలేజీ రోడ్డులో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం, లెనిన్‌నగర్‌కు చెందిన పెరికల సాగర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా, చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. గుంటూరు నగరంలో కొత్తపేట, లాలాపేట, పాతగుంటూరు, ఖమ్మం, ప్రాంతాల్లో చోరి చేసిన 11 ద్విచక్ర వాహనాలతోపాటు, మూడు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.11 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐలు రమేష్, తరంగిణి, సిబ్బంది ఆంథోని, కోటేశ్వరరావు, అనిల్ తదితరులను అభినందించారు.